'కూలీలు రూ.300 వేతనం పొందాలి'

కూలీలతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

పాల్వంచ రూరల్, ఫిబ్రవరి 18: ఉపాధి హామీ కూలీలు రోజుకు మూడు వందల రూపాయల వేతనం పొందే విధంగా మార్కింగ్ చేసుకుని పనులు చేయాలని డీఆర్డీవో, అదనపు కలెక్టర్ విద్యాచందన సూచించారు. మండలంలోని జగన్నాథపురం గ్రామ పంచాయతీలో జరుగుతున్న రోడ్డు పనులను మంగళవారం ఆమె పరిశీలించి కూలీలతో మాట్లాడారు. ఎండ తీవ్రత ఉన్నందున కూలీలు ఉదయం తొందరగా పనులకు రావాలన్నారు. పని ప్రదేశంలో మంచినీటి సదుపాయం కల్పించాలని అధికారులను ఆదేశించారు. పొలాలకు వెళ్లేందుకు రైతులు అంగీకరిస్తే రోడ్డు నిర్మాణం చేపట్టడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో విజయభాస్కర్‌రెడ్డి, టెక్నికల్ ఆఫీసర్ రాజు, ఏపీవో రంగా, శ్రీను, పంచాయతీ కార్యదర్శులు సాయిరాం, రవికుమార్, క్షేత్ర సహాయకులు శంకర్, లక్ష్మి పాల్గొన్నారు.

గ్రంథాలయ భవన సందర్శన

గ్రంథాలయాన్ని పరిశీలిస్తున్న విశ్రాంత ఉద్యోగులు

కొత్తగూడెం గణేష్ టెంపుల్, ఫిబ్రవరి 18 : గ్రంథాలయం నూతన భవనం కార్పొరేట్ స్థాయిలో ఆకట్టుకునేలా ఉందని విద్యానగర్ కాలనీ విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కొల్లు నాగేశ్వరరావు, కార్యదర్శి సురేష్‌కుమార్ అన్నారు. మంగళవారం నూతన గ్రంథాలయ భవనాన్ని సందర్శించారు. చక్కటి వాతావరణం, ఆహ్లాదకరమైన పరిస్థితుల నడుమ గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. బి.కేశవరావు, రాములు, శివరామ కృష్ణ, గురుమూర్తి, సాంబయ్య, కామేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రజా పోరాటాలు నిర్మించాలి

భద్రాచలం, ఫిబ్రవరి 18: ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజలను కదిలించి ప్రజా పోరాటాలు నిర్మించడమే బండారు తులసికి ఇచ్చే ఘన నివాళి అని సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు అన్నారు. బండారు తులసి వర్ధంతి సందర్భంగా ఆయన మాట్లాడారు. దేశంలో కమ్యూనిస్టుల ప్రాధాన్యత మరింత పెరిగిందన్నారు. కార్యక్రమంలో ఏజే రమేష్, కె.బ్రహ్మాచారి, ఎంబీ నర్సారెడ్డి, ఎన్.లీలావతి, బండారు శరత్‌బాబు, వై.వెంకటరామారావు, సంతోష్‌కుమార్, ఎంవీఎస్ నారాయణ, జీవన జ్యోతి, శ్రీనివాస్, అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

టీబీపై అవగాహన సదస్సు

అవగాహన కల్పిస్తున్న వైద్యులు

రామవరం, ఫిబ్రవరి 18 : వందరోజుల టీబీ అవగాహన సదస్సుల సందర్భంగా సీఆర్‌పీ క్యాంపు హనుమాన్‌గుడి వద్ద మంగళవారం డాక్టర్ రాము ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కల్పించారు. ఏదైనా అనుమానాలు ఉంటే వెంటనే సమీపంలోని వైద్యశాలను సంప్రదించి పరీక్షలు చేయించుకోవాలన్నారు. రెండు వారాలకుపైగా పొడి దగ్గు వస్తున్నా, తేమడ పడినా, తేమడతోపాటు రక్తం పడుతున్నా, రాత్రిళ్లు చలితో జ్వరం వస్తున్నా, ఆకలి లేకపోయినా, బరువు తగ్గుతున్నా టీబీ లక్షణాలై ఉండవచ్చని చెప్పారు. కార్యక్రమంలో టీబీహెచ్‌వీ కృష్ణవేణి, పీహెచ్‌ఎం శ్రీనివాసరావు, ఏఎన్‌ఎం రాజేశ్వరి, అంగన్‌వాడీ టీచర్ మంజుల, ఆశ కార్యకర్తలు భవాని, రాజమణి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

జూలూరుపాడు, ఫిబ్రవరి 18 : మండల పరిధిలోని సబ్ మార్కెట్‌యార్డు సమీపంలో చండ్రుగొండ మండలం, రేపల్లెవాడ పంచాయతీ సత్యనారాయణపురం గ్రామానికి చెందిన ఈసం శేఖర్‌బాబు(27) గుర్తుతెలియని వాహనం ఢీకొని అక్కడికక్కడే మృతిచెందాడు. లారీడ్రైవర్‌గా పనిచేస్తున్న శేఖర్‌బాబు తన ద్విచక్రవాహనంపై మంగళవారం తెల్లవారుజామున ఖమ్మం వెళ్తుండగా ప్రమాదం జరిగింది. ఘటనా స్థలానికి పోలీసులు చేరుకొని ప్రమాద వివరాలు సేకరించి మృతదేహాన్ని కొత్తగూడెం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ Classifieds

CHANGE OF NAME

I, SHAIK YAKOOB PASHA (OLD NAME) CHANGED MY NAME AS SHAIK YAKUB PASHA (NEW NAME) S/O. SHAIK KHAJA, R/O. H.NO. 1-37/3, MAIN ROAD, TEKULAPALLI - 507123, BHADRADRI KOTHAGUDEM DIST,TG.
KMM

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించ కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములలో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఇరువురికి గ్రామస్తుల దేహశుద్ధి

అశ్వారావుపేట, ఫిబ్రవరి 18 : వివాహేతర సంబంధం కొనసాగిస్తున్న ఇరువురిని గ్రామస్తులు పట్టుకుని దేహశుద్ధి చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని ఖమ్మంపాడు గ్రామానికి చెందిన వివాహితతో గాండ్లగూడెంకు చెందిన వ్యక్తి వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. ఈ దశలో మంగళవారం ఆమె ఇంటికి వచ్చిన వ్యక్తితో పాటు మహిళను పట్టుకున్న కొందరు గ్రామస్తులు దేహశుద్ధి చేశారు. పోలీసులకు సమాచారం అందించడంలో అక్కడకు చేరుకుని ఇరువురిని అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. దీనిపై సమాచారం అందిందని, ఎటువంటి ఫిర్యాదు అందలేదని ఎస్సై యయాతి రాజు తెలిపారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

వేసవిలో నీటి ఎద్దడి రాకుండా చర్యలు

వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్

భద్రాద్రి కొత్తగూడెం, ఫిబ్రవరి 18 (నమస్తే తెలంగాణ) : వేసవిలో నీటి ఎద్దడి సమస్య తలెత్తకుండా కార్యాచరణ రూపొందించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అధికారులను ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్ నుంచి జిల్లాల కలెక్టర్లు, అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కొత్తగూడెంలోని ఐడీవోసీ కార్యాలయం నుంచి కలెక్టర్ జితేశ్ వి పాటిల్, అదనపు కలెక్టర్ వేణుగోపాల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన, జడ్పీ సీఈవో నాగలక్ష్మి, జిల్లా అధికారులు పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వ్యవసాయ రంగానికి, తాగునీరు, నిర్మాణ రంగానికి విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకుంటామని, జిల్లాలో విద్యుత్ వినియోగంపై అధికారులతో సమీక్షిస్తూ అవసరమైన చర్యలు చేపడుతున్నామని అన్నారు. సమావేశంలో డీఏవో బాబూరావు, మిషన్ భగీరథ ఈఈలు తిరుమలేష్, నళిని, జిల్లా విద్యుత్‌శాఖ అధికారి మహేందర్, నీటిపారుదలశాఖ ఈఈ రాంప్రసాద్, పౌర సరఫరాలశాఖల అధికారులు త్రినాథ్‌బాబు, రుక్మిణి, కొత్తగూడెం మున్సిపల్ కమిషనర్ శేషాంజన్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

నేడు వామపక్షాల నిరసన

జూలూరుపాడు : మాట్లాడుతున్న కమ్యూనిస్టు పార్టీ నాయకులు

ఇల్లెందు, ఫిబ్రవరి 18 : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కార్మిక, కర్షక, పేదల వ్యతిరేక బడ్జెట్‌ను నిరసిస్తూ ఈ నెల 19వ తేదీ బుధవారం వామపక్షాలు చేపట్టే నిరసన కార్యక్రమాలను జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు దేవరకొండ శంకర్, సీపీఎం మండల కార్యదర్శి ఆలేటి కిరణ్ పిలుపునిచ్చారు. మంగళవారం ఇల్లెందు సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ కార్యాలయంలో నిర్వహించిన వామపక్షాల సమావేశంలో వారు మాట్లాడారు. వ్యవసాయ ఉత్పత్తులకు కనీస మద్దతు ధర ఇవ్వాలని, బీమా రంగంలో వందశాతం ఎఫ్‌డీఐ ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు రాసుద్దీన్, నాయిని రాజు, మోహన్‌రావు, నాగయ్య, కృష్ణ, సురేష్ పాల్గొన్నారు.

జూలూరుపాడులో..

జూలూరుపాడు, ఫిబ్రవరి 18 : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజావ్యతిరేక బడ్జెట్‌కు నిరసనగా వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించే నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వామపక్ష నాయకులు కోరారు. మండల కేంద్రంలోని సీపీఎం పార్టీ కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో జాటోత్ కృష్ణ, వెంకటేశ్వర్లు, నరేష్, రమేష్, గోపాలరావు, ధర్మా, మధు పాల్గొన్నారు.

నడిరోడ్డుపై మృతదేహంతో ధర్నా

రోడ్డుపై ధర్నా చేస్తున్న కుటుంబ సభ్యులు

చుంచుపల్లి, ఫిబ్రవరి 18 : తమకు న్యాయం చేయాలని కోరుతూ మృతదేహంతో కుటుం బసభ్యులు నడిరోడ్డుపై ఆందోళన చేసిన సంఘటన జిల్లా కేంద్రంలో మంగళవారం చోటుచేసుకుంది. వివరాల్లోకెళ్తే.. చుంచుపల్లి మండలం ఎస్ఆర్ డీజీ స్కూల్ బస్ క్లీనర్‌గా దేశబోయిన శ్రీనివాస్ (45) పనిచేస్తున్నాడు. ఐదురోజుల క్రితం స్కూల్ పిల్లల్ని జూలూరుపాడులో దించే క్రమంలో వేరొక వాహనం ఢీకొట్టడంతో గాయాలపాలై మంగళవారం మృతిచెందాడు. దీంతో మృత దేహాన్ని తీసుకొని పాఠశాల వద్దకు వస్తున్న కుటుంబసభ్యులను పోలీసులు అడ్డుకోవడంతో ప్రధాన రహదారిపైనే బైఠాయించి నిరసన తెలిపారు. తమకు స్కూల్ యాజమాన్యం న్యాయం చేసేవరకు కదలమని భీష్మించుకొని కూర్చొన్నారు. పోలీసులు హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

జాతర పోస్టర్లు ఆవిష్కరణ

పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సురేందర్

టేకులపల్లి, ఫిబ్రవరి 18 : శ్రీ లింగ బస్వేశ్వర స్వామి జాతర మహోత్సవ పోస్టర్లను మాజీ సర్పంచులు కోరం సురేందర్, కోరం ఉమ, ఆలయ కమిటీ సభ్యులు మంగళవారం ఆవిష్కరించారు. టేకులపల్లి మండలం కోయగూడెం గ్రామ పంచాయతీ పరిధి ఇప్పలతండాలో ప్రతి సంవత్సరం జాతర నిర్వహిస్తున్నారు. రంగీలాల్, బానోత్ శ్రీను, జరుపుల మంగమ్మ, అనిల్ పాల్గొన్నారు.

బియ్యం అందజేత

భద్రాచలం, ఫిబ్రవరి 18: భద్రాచలంలో ఆల్ పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పరివర్తన యశోద పౌండేషన్ సేవా సమితికి 25 కేజీల బియ్యం అసోసియేషన్ అధ్యక్షులు బందు వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి కేఎస్ఎల్‌వీ ప్రసాద్, కృష్ణమూర్తి అందజేశారు.టి.శివ ప్రసాద్, నాళం సత్యనారాయణ, సీహెచ్ సుబ్బయ్య, ఎస్.రాజబాబు, టి.శివ ప్రసాద్ పాల్గొన్నారు.

మిర్చి రైతులను ఆదుకోండి : సీపీఎం

బూర్గంపాడు, ఫిబ్రవరి 18: మిర్చి రైతులకు గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి బత్తుల వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. మిర్చికి కనీస మద్దతు ధర రూ.25,000 కేటాయించాలని, ప్రభుత్వాలు తక్షణమే కనీస మద్దతు ధర ప్రకటించాలని కోరారు.

నేడు సేవాలాల్ జయంతి

ఏర్పాట్లను పరిశీలిస్తున్న నాయకులు

లక్ష్మీదేవిపల్లి, ఫిబ్రవరి 18 : కొత్తగూడెం నియోజకవర్గంలో ఈ నెల 19వ తేదీ బుధవారం శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ 286వ జయంతిని పురస్కరించుకొని ఇల్లెందు క్రాస్‌రోడ్‌లోని హరిత హోటల్ ప్రాంగణంలో భోగ్‌బండారో కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమంలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని గిరిజన బంజారా సంఘాల నిర్వహణ కమిటీ ఉపాధ్యాయ, ఉద్యోగాల ఐక్య కమిటీ నాయకులు కోరారు. ఈ సందర్భంగా జరుగుతున్న ఏర్పాట్లను మంగళవారం వారు పరిశీలించారు.

ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

అశ్వారావుపేట, ఫిబ్రవరి 18 : అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను కొత్తగూడెం స్పెషల్ బ్రాంచ్ పోలీసులు పట్టుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని అనంతారం సమీపంలోని వాగు నుంచి కొందరు వ్యాపారులు అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా అశ్వారావుపేటకు తరలిస్తున్నారు. అప్పటికే నిఘా పెట్టిన పోలీసులు మంగళవారం తెల్లవారుజామున పట్టుకున్నారు. ఇసుక తరలిస్తున్న తాండ్ర రాము, అరవింద్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు ఎస్సై యయాతి రాజు తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

పాల్వంచ రూరల్, ఫిబ్రవరి 18 : అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టరును పోలీసులు పట్టుకుని డ్రైవర్, యజమానిపై మంగళవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... సంగం వద్ద పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా ఎటువంటి అనుమతి పత్రాలు లేకుండా ఇసుక రవాణ చేస్తున్న ట్రాక్టరును పట్టుకున్నారు. ట్రాక్టరును కిన్నెరసాని పోలీస్‌స్టేషన్‌కు తరలించి, పాకాల వెంకట్రావు, నాగమళ్ళ రవిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అనుబోస్ కాలేజీలో శిక్షణ తరగతులు

పాల్వంచ, ఫిబ్రవరి 18 : స్థానిక పాల్వంచ అనుబోస్ ఇంజినీరింగ్ కాలేజీలో రెండో సంవత్సరం, మూడో సంవత్సరం చదువుతున్న బీటెక్ విద్యార్థినులకు తెలంగాణ టాస్క్ ఆధ్వర్యంలో ఈ నెల 17, 18వ తేదీల్లో కమ్యూనికేషన్స్ స్కిల్స్‌పై శిక్షణ నిర్వహించనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ రవి మంగళవారం తెలిపారు. టాస్క్ రిసోర్స్‌పర్సన్ ఆంటోని విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ వెంకన్న, వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

ఇల్లెందులో వీధికుక్కల నియంత్రణ

ఇల్లెందు, ఫిబ్రవరి 18: ఇల్లెందు మున్సిపాలిటీ పరిధిలో వీధికుక్కల నియంత్రణకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్ తెలిపారు. మంగళవారం ఇల్లెందు మున్సిపాలిటీ పరిధిలో 13వ, 14వ వార్డుల్లో వీధి కుక్కలను ప్రత్యేక టీం ఆధ్వర్యంలో పట్టుకొని కొత్తగూడెం డాగ్ కేర్ సెంటర్ తరలించారు. కుక్కలకు కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్స చేస్తున్నారని తెలిపారు.

సీఎం పీఎఫ్‌ను అప్డేట్ చేయాలి

వినతిపత్రం ఇస్తున్న ఏఐటీయూ నాయకులు

ఇల్లెందురూరల్, ఫిబ్రవరి 18: సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల సీఎం పీఎఫ్‌ను వెంటనే అప్డేట్ చేయాలని ఏఐటీయూసీ నాయకుల ఆధ్వర్యంలో సీఎం పీఎఫ్ రీజనల్ కమిషనర్ ఎం.కనకమ్మకు వినతిపత్రం ఇచ్చారు. మంగళవారం ఇల్లెందు వైసీఓఏ క్లబ్‌లో బొగ్గు గనుల భవిష్య నిధి ట్రైపాటేట్ మీటింగ్ సందర్భంగా వచ్చిన సీఎం పీఎఫ్ రీజియన్ రీజనల్ కమిషనర్ కనకమ్మకు ఏఐటీయూసీ సంఘం బ్రాంచ్ కార్యదర్శి ఎండీ నజీర్ అహ్మద్ ఆధ్వర్యంలో కలిశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు బందం నాగయ్య, దాసరి రాజారాం, శావలి, పండు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బంద్‌కు పిలుపునిచ్చిన మావోయిస్టులు

తెలంగాణ–ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో పోలీసుల హై అలర్ట్

తనిఖీలు ముమ్మరం చేసిన భద్రతా బలగాలు

కొత్తగూడెం ప్రగతి మైదాన్, ఫిబ్రవరి 18 : ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టులు బంద్‌కు పిలుపునిచ్చిన నేపథ్యంలో తెలంగాణ–ఛత్తీస్‌గఢ్ పోలీసులు మంగళవారం హై అలర్ట్ ప్రకటించారు. ఆపరేషన్ 'కగార్'కు నిరసనగా బీజాపూర్–సుక్మా–దంతెవాడ జిల్లాల బంద్‌కు మావోయిస్టులు పిలుపునిచ్చారు. దీంతో ఇరు రాష్ట్రాల పోలీసు యంత్రాంగాలు అప్రమత్తమయ్యాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల, పూసుగుప్ప, మారాయిగూడెం అటవీ ప్రాంతాల్లో భద్రతా దళాలు గాలింపు చర్యలు ముమ్మరం చేశాయి. బంద్ నేపథ్యంలో మావోయిస్టులు అలజడి సృష్టించే అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. కొందరు అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారణ చేపడుతున్నట్లు సమాచారం.

గురుకులంలో వైద్యశిబిరం

వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి ప్రియాంక

అన్నపురెడ్డిపల్లి, ఫిబ్రవరి 18 : మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర కళాశాలలో ఎర్రగుంట ప్రభుత్వ వైద్యశాల ఆధ్వర్యంలో మంగళవారం వైద్యశిబిరం నిర్వహించారు. వైద్యాధికారి ప్రియాంక విద్యార్థులకు వైద్య పరీక్షలు చేసి మందులను పంపిణీ చేశారు. విద్యార్థులు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతను పాటించాలని, వేడి పదార్థాలను మాత్రమే ఆహారంగా స్వీకరించాలన్నారు. జ్వరం వస్తే నిర్లక్ష్యం చేయకుండ వైద్యులను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ముత్తంగి అలంకారంలో భద్రాద్రి రామయ్య

నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం, ఫిబ్రవరి 18: భద్రాచలంలోని సీతారామచంద్రస్వామి వారు సోమవారం సందర్భంగా రామయ్య స్వామి ముత్తంగి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. అలాగే నిత్యకల్యాణ మండపంలో స్వామివారి నిత్యకల్యాణాన్ని అర్చకులు వైభవంగా నిర్వహించారు. విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, కంకణదారణ, జీలకర్రబెల్లం, మాంగల్యదారణ, వేద ఆశీర్వచనం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఏరియాలో పర్యటించిన డైరెక్టర్

మాట్లాడుతున్న డైరెక్టర్ వెంకటేశ్వర్లు

రామవరం, ఫిబ్రవరి 18 : నూతనంగా బాధ్యతలు చేపట్టిన డైరెక్టర్(పీపీ) వెంకటేశ్వర్లు ఏరియాలోని జేవీఆర్ సీహెచ్‌పీని తనిఖీ చేశారు. జేవీఆర్ సీహెచ్‌పీని తనిఖీ చేసి ఉత్పత్తి అయిన బొగ్గు రవాణాపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. కోల్ రిసీవింగ్ కాంప్లెక్స్ వద్ద బొగ్గు అన్‌లోడింగ్ చేసేటప్పుడు వచ్చే సమస్యలను గురించి క్లుప్తంగా సంబంధిత అధికారులతో చర్చించారు. ఆయన వెంట ఏరియా జీఎం శాలెంరాజు, జీఎం సివిల్ సూర్యనారాయణ, ఎసీవోటు జీఎం కోటిరెడ్డి ఉన్నారు.

కృత్రిమ మేధస్సుపై అవగాహన

ప్రశంసా పత్రాలు పొందిన విద్యార్థులు

పాల్వంచ రూరల్, ఫిబ్రవరి 18 : 'కృత్రిమ మేధ' పై మండలంలోని లక్ష్మీదేవిపల్లి(ఎస్) ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు డిపార్ట్‌మెంట్ ఆఫ్ కంప్యూటర్స్ ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ పద్మ మాట్లాడుతూ నూతన విషయాలను అత్యంత వేగవంతంగా తెలుసుకోవటం, వివిధ రకాల సమస్యలకు తక్షణ పరిష్కారం కనుక్కోవడం, బ్యాంకింగ్ రంగంలో మోసాలను ముందే పసిగట్టి నివారణ ఉపాయాలతోపాటు అనేక సమస్యల పరిష్కారం తెలుసుకోవచ్చునన్నారు. విద్యార్థులు తమ ప్రాజెక్టులను వివరించారు. వారికి ప్రశంసా పత్రాలను అందించారు. కార్యక్రమంలో విమల, దీపిక, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జె. మాధవి, అరుణకుమారి, కొండలరావు, రమేష్, కామేశ్వరరావు, శ్రీనివాస్, స్వరూపరాణి, శ్రీదేవి, కరీమా, బాబ్జి పాల్గొన్నారు.

సమ్మక్క-సారలమ్మ జాతర ప్రారంభం

దుమ్ముగూడెం, ఫిబ్రవరి 18 : దుమ్ముగూడెం మండలం కొత్తూరు నారాయణరావుపేట గ్రామంలో ఆదివాసీ గణాచారుల ధర్మ సంరక్షణ సమితి ఆధ్వర్యంలో సమ్మక్క–సారలమ్మ కాళీమాత జాతర సోమవారం ప్రారంభమైంది. జాతరలో భాగంగా తొలి రోజు గంగ పూజ నిర్వహించారు. మంగళవారం సారలమ్మను గుర్రాల గుట్ట నుంచి గద్దెకు తీసుకొచ్చుట, బుధవారం నిండుజాతర ఉంటుంది. ఆదివారం అమ్మవార్ల తిరుగువారం గుట్టకి వెళ్లడం జరుగుతుందని ఆలయ పూజారి కుర్సం సోమయ్య తెలిపారు. కార్యక్రమంలో దేవరబాల కుర్సం బాయమ్మ, గ్రామకమిటీ సభ్యులు పాయం నరసింహారావు, పాయం రాజు, మారయ్య, వెంకటేష్, కొర్స మారయ్య, వీరభద్రయ్య, కుర్సం సీతయ్య, కొమరం ముత్తయ్య పాల్గొన్నారు.

మండలంలో వరుస దొంగతనాలు

సత్యనారాయణపురంలో మరో చోరీ

చర్ల, ఫిబ్రవరి 18: మండలంలో రెండు రోజుల్లో రెండు చోట్ల వరుస దొంగతనాలు జరిగాయి. ఆదివారం రాత్రి నగల దుకాణంలో దొంగలుపడి బంగారు, వెండి నగలు దోచుకుపోయి 24 గంటలు గడవకముందే సోమవారం రాత్రి మరో ఇంట్లో దొంగలు పడి నగదు, బంగారు నగలు ఎత్తుకుపోయారు. ఇందుకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. సత్యనారాయణపురం గ్రామానికి చెందిన నడింపల్లి రామచంద్రరాజు ఇంట్లో దొంగలుపడి సుమారు రెండు లక్షల నగదు, రెండు బంగారు గాజులు ఇతర వస్తువులు దోచుకుపోయారు. చర్ల సీఐ రాజువర్మ ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థినికి ఆర్థిక సహాయం

భద్రాచలం, ఫిబ్రవరి 18: కష్టాల్లో ఉన్న పేద విద్యార్థికి నేనున్నానంటూ ముందుకు వచ్చి ఆర్థిక సహాయం అందించిన మదర్ థెరిసా చారిటబుల్ ట్రస్టు సేవలు మరువలేనివి ప్రముఖ వైద్యుడు డాక్టర్ అక్కినేని లోకేష్ అన్నారు. భద్రాచలంలో సోమవారం ఇంటర్ చదువుతున్న గుండిపూడి ఛార్మికి ఇంట్లో ఆర్థిక పరిస్థితులు బాగోలేక ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో చారిటబుల్ ట్రస్ట్ ద్వారా రూ.23 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా అక్కినేని లోకేష్ మాట్లాడుతూ.. ఇష్టంతో కష్టపడి చదివి భవిష్యత్‌లో ఉన్నతమైన స్థాయిలో ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆర్థిక సహాయం అందించిన ఎస్ఎల్‌బీటీ పెయింట్స్ యజమానులు సెట్టి వేణు రాజ్, వీవీ సూర్యతేజ, అబ్దుల్ ఉఫర్ పాల్గొన్నారు.

రెండు జిల్లాల స్థాయి క్రీడలు ప్రారంభం

క్రీడలను ప్రారంభిస్తున్న కొమరం వంశీయులు

ఆళ్ళపల్లి, ఫిబ్రవరి 18: కొమరం వారి ఇలవేల్పు రెక్కల రామక్క జాతర సందర్భంగా రెండు జిల్లాల స్థాయి క్రీడా పోటీలను మంగళవారం ప్రారంభించారు. 20వ తేదీన నిండు జాతరకు ముఖ్య అతిథులుగా కలెక్టర్ వి.జితేష్ పటేల్, ఐటీడీఏ పీవో రాహుల్ రానున్నట్లు కమిటీ నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు మాజీ జడ్పీటీసీ కొమరం హనుమంతరావు, కొమరం వెంకన్న, రాంబాబు, సత్యనారాయణ, వెంకటకృష్ణ, సతీష్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

మున్నూరు కాపు పెద్దల సమావేశం

సమావేశంలో పాల్గొన్న నాయకులు

పాల్వంచ, ఫిబ్రవరి 18: తెలంగాణలో మున్నూరుకాపులు 2014 సర్వే ప్రకారం జనాభా 28 లక్షలు ఉంటే రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల జరిపించిన కులగణన సర్వేలో కేవలం 13లక్షల మంది మాత్రమే ఉన్నారని చెప్పడం సరికాదని, మళ్లీ సర్వే చేయాలని కాపులు డిమాండ్ చేశారు. పాల్వంచలోని ఎడవల్లి కృష్ణ ఆధ్వర్యంలో ఆయన నివాసంలో వారు సమావేశమయ్యారు. ఈ నెల 24వ తేదీన కొత్తగూడెం పట్టణంలో తలపెట్టిన మహార్యాలీని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో కాంపెల్లి కనకేష్‌పటేల్, ఎన్‌పీ నాయుడు, రమణమూర్తినాయుడు, చెన్నం శెట్టి రంగారావు, బోసుబాబు, చింతా నాగరాజు, తోట రామకృష్ణ, పుల్లారావు, పెద్ద మ్మగుడి శ్రీను, రాము, ఆనంద్, పెంటయ్య, అంజయ్య పాల్గొన్నారు.